

ఎర్రగడ్డలో జెండాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

అమరుల త్యాగాలతోనే తెలంగాణ ఏర్పాటు

» జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి, అమరుల త్యాగాల ఫలితంతో తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డలోని బి శంకర్‌లాల్‌నగర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల వేడుకల్లో భాగంగా జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత కేసీఆర్ సూచన మేరకు మూడు రోజులు వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు డి.సంజీవ, నాయకులు జావేద్, నర్సింగ్, రౌంపి బాలకృష్ణ, తరుణ్, శ్రీను, రాము, రమణ, దీపు, చంద్రశేఖర్, గంటా కృష్ణ, అనిల్ గౌడ్, శేఖర్, కల్యాణి, ఉష, యాదమ్మ, రజియా, సక్కుబాయి, సైదమ్మ పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో

యూసుఫ్‌గూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోమవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. యూసుఫ్‌గూడ బస్తీలో జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం పండ్లు పంపిణీ చేశారు. బోరబండ డివిజన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి యూపీహెచ్‌సీ కేంద్రంలో గర్భిణులకు పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, హసన్, వేణుగోపాల్, బోరబండ డివిజన్ అధ్యక్షులు కృష్ణమోహన్, నాయకులు విజయ్‌కుమార్, ఆనంద్, బైక్ రమేష్ పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ శేషుకుమారిని పరీక్షిస్తున్న వైద్యుడు

వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

అమీర్‌పేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యం అందని ద్రాక్షలా మారిన ఈ రోజుల్లో ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నారు. మగ్నిడ్ డయాగ్నోస్టిక్ ఎండీ సింగం శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయంలో శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా బ్లడ్, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ మార్కర్, ఈసీజీ టెస్ట్‌లను రూ. 499కే చేశారు. కార్పొరేటర్ శేషుకుమారి కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పార్థసారధి, సహదేవ్ గౌడ్, యాదగిరి, ముక్తారెడ్డి, కూతురు నర్సింహ పాల్గొన్నారు.



యువతికి ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న పోలీసులు

ఆటోలో మరచిపోయిన ల్యాప్‌టాప్‌ను బాధితురాలికి అప్పగించిన పోలీసులు

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ఓ యువతి మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను పోలీసులు గంటలో స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రమ్య ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయానికి ఆటోలో వచ్చింది. కొద్దిసేపటికి ల్యాప్‌టాప్‌ను ఆటోలో మరిచినట్టు గుర్తించి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా గంటలో ఆటోను పట్టుకొని ల్యాప్‌టాప్‌ను బాధితురాలికి అప్పగించారు.

సుందర్‌నగర్ కాలనీలో నిత్యాన్నదానం

అమీర్‌పేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఆకలి, దప్పికలతో అలమటించే పాదచారులకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో 2016లో ఏర్పడిన మానవ సేవా చారిటబుల్ ట్రస్టు దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోంది. రోజూ 350 మందికి టమాటా రైస్, పెరుగన్నం, అన్నం, కుర్మా, స్వీట్‌తో పాటు అరటి పండు, మజ్జిగ అందిస్తోంది. సనత్‌నగర్ డివిజన్ సుందర్‌నగర్ కాలనీ ఆంధ్రాబ్యాంక్ సమీపంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి 16న ప్రారంభమైన ఈ కార్యక్రమం మరో వారం రోజులు కొనసాగనుంది. సోమవారం కట్ట ముసలయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బుచ్చిబాబు, శశికాంత్, మాచారావు, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.



పాదచారులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

మధురానగర్ కాలనీలో విద్యుత్ తీగ తెగి నిలిచిన సరఫరా

వెంగళరావునగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి విద్యుత్ తీగ తెగడంతో కొన్ని ఇళ్లకు సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెట్టు కొమ్మల మధ్య రాపిడి కారణంగా విద్యుత్ తీగ తెగినట్టు గుర్తించిన సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.



కౌంటింగ్‌కు సర్వం సిద్ధం!

» కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వద్ద
» మూడంచెల భద్రత
» రంగంలో అదనపు బలగాలు
» ఉదయం 9 లోపు తొలి ఫలితం

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరగనుంది. ఈవీఎంలను సైతం ఇక్కడే స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవుతుంది. రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించడంతో పాటు స్ర్కీన్లపై డిస్‌ప్లే చేస్తారు. సిబ్బంది ఉదయం ఆరు గంటలకే చేరుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వివిధ పార్టీల కౌంటింగ్ పాస్‌లు ఉన్న ఏజెంట్లు ఉదయం 8లోగా స్టేడియానికి వచ్చి కేటాయించిన స్థానాల్లో ఉండాలని సూచించారు.

జూబ్లీహిల్స్ కోసం 20 టేబుళ్లు...

సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం అతి పెద్దది. ఇక్కడ ఓటర్లు ఎక్కువ ఉండటంతో పాటు పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. కౌంటింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 14 టేబుళ్ల పై జరుగుతుంది. ఒక్కో రౌండ్ ఓట్ల లెక్కింపునకు కనీసం 15 నిమిషాల సమయం పడుతుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లెక్కింపు 17 రౌండ్లు, ఖైరతాబాద్ నియోజకవర్గం లెక్కింపు 18 రౌండ్ల పాటు కొనసాగనుంది. ఉదయం 9 లోపు తొలి ఫలితం వెలువడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోజ్ పరిశీలించారు. సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు ఉదయం 6 గంటలకే చేరుకోవాలని సూచించారు. ఈవీఎం మెషిన్లకు సీల్ పరిశీలించిన తరువాతే కౌంటింగ్ మొదలు పెట్టాలన్నారు. ఏజెంట్ పాస్‌లు లేని వారిని లోపలికి అనుమతించవద్దని తెలిపారు. సెల్‌ఫోన్లు లోపలికి తీసుకురాకుండా చూసుకోవాలన్నారు.

మూడెంచల భద్రత....

కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ కోసం పోలీసులు మూడెంచల భద్రత ఏర్పాటు చేయనున్నారు. స్టేడియం లోపల, చుట్టూ సాయుధులైన కేంద్ర బలగాలు పహారా కాస్తాయి. మరో అంచెలో రాష్ట్ర సాయుధ భద్రతా సిబ్బంది బందోబస్తుగా ఉంటారు. స్టేడియం బయట నగర పోలీసు శాఖ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇందుకోసం సుమారు 300 మంది అదనపు పోలీసులను వినియోగించనున్నారు. సాయుధులైన సిబ్బంది 70 మంది స్టేడియం లోపల పహారా కాయనున్నారు. స్టేడియంలో కేవలం సిబ్బంది వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఏజెంట్లు, మీడియా సిబ్బంది వాహనాలు స్టేడియం వెనుక ఉన్న గ్రౌండ్‌లో నిలపాలి. ఎన్నికల అధికారులు ఇచ్చిన ఏజెంట్ల పాసులు ఉన్న వారినే స్టేడియంలోకి అనుమతిస్తారు. కౌంటింగ్ హాల్‌లో మొబైల్ అనుమతించబోరు.



కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్



కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో కౌటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

ఓటర్ల వివరాలు ఇలా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో	
మొత్తం ఓటర్లు	3,87,056
పోలైన ఓట్లు	1,76,459
పురుషులు	89432
మహిళలు	87021
ఇతరులు	06
శాతం	45.59
ఖైరతాబాద్ నియోజకవర్గం	
మొత్తం ఓటర్లు	2,99,851
పోలైన ఓట్లు	1,50,653
పురుషులు	78153
మహిళలు	72490
ఇతరులు	10
శాతం	50.26

పటిష్టమైన భద్రత : ఏసీపీ వెంకటగిరి



స్టేడియంలో కౌంటింగ్ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. జూబ్లీహిల్స్ పోలీసులు, ఇతర ఠాణాల సిబ్బంది భద్రతలో పాలుపంచుకుంటారు. ఇప్పటికే స్టేడియంలో భద్రత కోసం కేంద్ర బలగాలు వచ్చాయి. స్టేడియం బయట, వెలుపల ముగ్గురు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పహారా కాస్తారు. రెండో అంచెలో సాయుధులైన రాష్ట్ర పోలీసు సిబ్బంది పహారా కాస్తారు. కౌంటింగ్ విషయంలో ఎలా నడుచుకోవాలో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. కౌంటింగ్ పూర్తయిన తరువాత ర్యాలీలు నిర్వహించకూడదు.

పౌరహక్కుల నేత వెంకటరమణిని వెనక్కి పంపిన పోలీస్‌లు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల నేత వెంకటరమణిని పోలీస్‌లు వెనక్కి పంపించారు. స్వీడన్ పౌరసత్వం కలిగిన వెంకటరమణిపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. వెంకటరమణి వస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీస్‌లు ఆయన్ను శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. 'వెంకటరమణిపై ప్రభుత్వం నిషేధం ఉంది. ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం. విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు." అని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి: దానం నాగేందర్

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ వేళ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ మూడు ప్రాంతాల్లో జరగనున్నట్టు చెప్పారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే పాసులు జారీ చేసినట్టు తెలిపారు. వీరంతా కౌంటింగ్ కేంద్రాలకు ఉదయం 6 గంటలకే చేరుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, సెల్‌ఫోన్లను లోపలికి తీసుకువెళ్లవద్దని సూచించారు. బూత్‌ల వారీగా ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లో కూర్చోవాలన్నారు. ఎన్నికల సమయంలో బూత్‌ల వారీగా పార్టీకి వచ్చిన లెక్కలను, అధికారుల వద్ద ఉన్న లెక్కలను సరిచూసుకోవాలన్నారు. ఈవీఎం మెషిన్లకు సీల్ ఉందా లేదా గమనిస్తూ ఉండాలని, అనుమానం వస్తే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పుకార్లను నమ్మవద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు కేంద్రాలను వదలవద్దని చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్ సంగీతా యాదవ్, ప్రధాన ఎన్నికల ఏజెంట్ మామిడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి

ఖైరతాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని, నిబంధనలు పాటించాలని ఖైరతాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పరిశీలకురాలు రూప సూచించారు. సోమవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపులో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలిచ్చారు. ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి తెలియజేశారు. సమావేశంలో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎఆర్‌వో, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, ఖైరతాబాద్ అసెంబ్లీ ఈఆర్‌వో, జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

19న హిందూమతంపై సమ్మేళనం

పంజాగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్వేషం, అసహనం, అసమానత్వం, సంకుచితత్వం లాంటివేవీ హిందూ తాత్వికతలో లేవని శాంతియుత సహజీవనమే హిందూ ఆచరణ అని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అన్నారు. అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ (హెచ్.పీఈ) సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 19న బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ద్వేషం, అసమానత్వాలకి వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై సమ్మేళనాన్ని, అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో హెచ్‌పీఈ అధ్యక్షుడు సాధు త్రినాథ దాస్, జై భారత్ సంస్థ జాతీయ అధికార ప్రతినిధి మల్లికా వల్లభ, అన్నమయ్య గృహ సాధన సంస్థ ఉపాధ్యక్షుడు శేషు పుస్తకావిష్కరణ కార్యక్రమ పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు బీవీ.రెడ్డి, బీఆర్.ప్రసాద్, విజయ్ రెడ్డి, బాలకృష్ణ యానంద స్వామి, లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

ఆర్బిట్రేషన్ ప్రోగ్రాంపై పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సు

ఖైరతాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ), జేఎన్‌టీయూ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్బిట్రేషన్ ప్రోగ్రాంపై సంవత్సరం వ్యవధితో కూడిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సోమవారం ఎస్కీ కళాశాలలో జరిగిన సమావేశంలో కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు ఆవిష్కరించారు. ఏ యూనివర్సిటీ నుంచైనా బ్యాచిలర్ డిగ్రీ పొందిన విద్యార్థులు, గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న వారు, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులో 3 సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ తెలిపారు. దరఖాస్తు ఫారాలను జూలై 30 వరకు కళాశాలలో అందించవచ్చునని రామేశ్వరరావు తెలిపారు.

అతిగా నవ్వుతూ..!

నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు. అలాగే నవ్వు నాలుగు విధాల చేటు చేస్తుందని కూడా అంటారు. కొందరి విషయంలో పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. ఓ వ్యక్తి విషయంలో ఇలాగే జరిగింది. టీవీలో కామెడీ షో చూసి విరగపడి ఎక్కువ సేపు నవ్వుతూనే అకస్మాత్తుగా అచేతనంగా కిందపడిపోయాడు. అతన్ని పరిశీలించిన వైద్యులు దాన్ని మూర్ఛకు సంబంధించిన.. స్పృహ కోల్పోయిన సమస్యగా నిర్ధారించారు. ఈరకం జబ్బుతో బాధపడే వారు కూడా ఉంటారా.. అని ఆశ్చర్యమనిపిస్తుంది. అవును ఇలాంటి ఓ కేసు అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ వద్దకు వచ్చింది. ఆయన ఈ కేసు వివరాలను తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పంచుకున్నారు.

- హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

● పగలబడి నవ్వుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తి
● కాసేపు అచేతనం.. తర్వాత సాధారణ స్థితికి
● అపోలోకి తరలింపు ● ఏమీ కాలేదని తేల్చిన వైద్యులు
● నవ్వు ప్రేరిత సింకోప్‌గా నిర్ధారణ



ఫైల్ ఫొటో

హైదరాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఓ వ్యక్తి విపరీతమైన నవ్వుతో స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. వారం, పది రోజుల క్రితం సదరు వ్యక్తి కుర్చీలో కూర్చుని టీ తాగుతూ తన కుటుంబంతో కలిసి టీవీలో కామెడీ షో చూస్తున్నాడు. ఆ షోలో ఒక అంశం ఆయనకు విపరీతమైన నవ్వును తెప్పించింది. నవ్వును అదుపు చేసుకోలేనంతగా కొన్ని నిమిషాల పాటు పగలబడి ఆగకుండా నవ్వాడు. ఈ క్రమంలో అతను నియంత్రణ కోల్పోయాడు. కొద్దిసేపటి తర్వాత, అతని శరీరం ఒక వైపునకు వంగి, కుర్చీ నుంచి నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో కళ్లు తెరిచి, తన శరీరాన్ని కదిలించడంతోపాటు మాట్లాడగలిగాడు. ఈ క్రమంలో అతన్ని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అతనికి ఎలాంటి హానీ జరగలేదని, అనారోగ్యం ఏమీ లేదని నిర్ధారించారు. అతన్ని న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ పరిశీలించి ఈ పరిస్థితిని నవ్వు ప్రేరిత సింకోప్ (Laughter-induced syncope)గా నిర్ధారించారు. ఇది వాసోవాగల్ మెకానిజమ్స్ వల్ల ఏర్పడే అరుదైన అంశంగా ఆయన గుర్తించారు. ఇది ఒక విధమైన మూర్ఛకు సంబంధిత సమస్య అని, ఎలాంటి మందులు అవసరం లేదని, ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తేల్చారు.

అధికనవ్వుతో రక్తసరఫరా తగ్గే ప్రమాదం..

విపరీతమైన నవ్వుతో ఒక్కోసారి రక్తపోటు వేగంగా తగ్గిపోతుందని, నాడీ వ్యవస్థ నుంచి అధిక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు. దీని వల్ల మెదడుకు ప్రవహించే రక్త సరఫరా తాత్కాలికంగా తగ్గుతుందని, ఫలితంగా స్పృహ కోల్పోయే ముప్పు ఉంటుందన్నారు. విపరీతమైన నవ్వు, ఎక్కువసేపు నిలబడటం, అధిక శారీరక శ్రమ వంటి మూర్ఛ సాధారణ ట్రిగ్గర్‌లను నివారించాలని డాక్టర్ సూచించా రు. బీపీ మందులు వినియోగిస్తున్నవారు, గుండె జబ్బులు ఉన్న వారు అతిగా, బిగ్గరగా నవ్వొద్దని ఆయన సూచిస్తున్నారు. ప్రమాదం లేమీ లేకపోయినప్పటికీ రక్త ప్రసరణలో మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. 'ఎప్పుడు నవ్వుతూ.. సంతోషంగా ఉండాలని, సంతోషమే సగం బలమని వైద్యులు తరుచూ చెబుతుంటారు. కానీ, దేనిని అతిగా తీసుకోవడం మంచిది కాదని ఈ కేసులో నిరూపితమైంది' అని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు.

ప్రియుడితో సహజీవనం చేస్తున్న మహిళ అనుమానాస్పద మృతి

నేరెడ్‌మెట్ 3 జూన్ (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోవడంతో మరో వ్యక్తితో సహజీవనం చేస్తున్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని కౌకూర్‌లోని మల్లారెడ్డి కాలనీలో నివాసముండే జీ. మాధవి (34) 2007లో వివాహం చేసుకొంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త అనారోగ్య కారణాలతో 2021లో చనిపోయాడు. ఆమె తన పిల్లలను జవహర్‌నగర్‌లోని కౌకూర్‌లో తల్లిదండ్రుల వద్ద పెట్టి, ప్రైవేటు సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తుంది. ఆదే సంస్థలో పనిచేస్తున్న అడ్డగుట్టకు చెందిన సాయి (24) అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. నేరేడ్‌మెట్, బలరామ్‌నగర్‌లోని ఓ పెంట్ హౌస్‌లో ఏడు నెలల నుంచి సాయితో పాటు మాధవి కలిసి ఉంటోంది. సోమవారం ఉదయం మాధవి పెద్ద కుమారుడికి ఆమె ఫోన్ నుంచి అల్మారాలో ఉన్న రూ. 20 వేలు, బ్యాగులో బండి తాళం ఉన్నాయి.. తీసుకోమని సందేశం వచ్చింది. కొంత సేపటికి సాయి ఫోన్ చేసి, మీ అమ్మ ఫోన్ తీయడం లేదు, బహుశా ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని చెప్పాడు. వెంటనే బాలుడు మాధవి ఉంటున్న నేరేడ్‌మెట్‌లోని బలరామ్‌నగర్‌లో ఉన్న పెంట్ హౌస్‌కు వెళ్లి చూడగా ఆమె మెడకు చున్నీ బిగించి ఉంది. అంతే కాకుండా తలపై బలమైన గాయంతో అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే తేరుకున్న మాధవి కుమారుడు నేరేడ్‌మెట్ పోలీసులకు సమాచారాన్ని అందించాడు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు రక్తపు దారలో పడి ఉన్న మాధవిని పరిశీలించి, చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు చేసి శవాన్ని పోస్టుమార్టమ్ కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సందీప్‌కుమార్ తెలిపారు.

కర్రలతో యువకుల దాడులు ఇరు వర్గాలపై కేసు నమోదు

బంజారాహిల్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నడి రోడ్డుపై యువకులు రెచ్చిపోయారు. కర్రలతో పరస్పరం దాడులు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వెంకటగిరికి చెందిన రియాజ్ ఖాన్, నదీమ్ అలియాస్ చోటు, మధు అలియాస్ విజయ్ ఆఫ్సర్ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 2న తెల్లవారుజామున శంషాబాద్‌లో ఓ ఫంక్షన్ నుంచి తిరిగి వచ్చి టెంట్‌హౌస్ సామాన్లు దించి టీ తాగేందుకు ఆటోలో బయలుదేరారు. అదే సమయంలో ఫతేనగర్‌కు చెందిన దేవురపల్లి పృథ్వీ, ఉజ్జిని పర్దీప్, జి.ఈశ్వర్, శశివర్ధన్ టిఫిన్ చేయడానికి వెంకటగిరికి ద్విచక్రవాహనాలపై వెళుతున్నారు. రెండు వర్గాల వారు ఎదురెదురు పడగానే పరస్పరం దూషించుకున్నారు. అరగంట తరువాత మళ్లీ కేకే వైన్స్ వద్ద మరోసారి ఎదురుపడి దూషించుకున్నారు. టెంట్‌హౌస్ సిబ్బంది ఫోన్ చేయడంతో మరికొంతమంది అక్కడకు చేరుకున్నారు. మాటామాట పెరగడంతో కర్రలతో దాడులు చేసుకున్నారు. రియాజ్‌ఖాన్ తల పగలడంతో శ్రీనగర్‌కాలనీలోని నిఖిల్ ఆస్పత్రికి తరలించారు. పృథ్వీ, పర్దీప్, ఈశ్వర్, శశివర్ధన్‌కు గాయాలు కావడంతో బాలానగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్టు

యూసుఫ్‌గూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ, హరినగర్ బిస్మిల్లాహోటల్ సమీపంలో నివాసముంటున్న మహ్మద్ ముజాకీర్ సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిఘాపెట్టిన బోరబండ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



మహ్మద్ ముజాకీర్

భవనం పైనుంచి పడిన వృద్ధుడి మృతి

యూసుఫ్‌గూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భవనం పైనుంచి కిందపడిన ఓ వృద్ధుడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. మధురానగర్‌లో నివసించే కే.గోపాలకృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. 2006లో భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి భవనం పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు కె.రామవెంకట్ రత్నం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్‌లో నివాసముంటున్న రెమ్మ వినీత ఆదివారం ఉదయం స్నేహితులతో కలిసి అనంతగిరి హిల్స్‌కు వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆమె బాబాయి ఉమామహేశ్వరరావు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ చేసి ఉంది. వినీత స్నేహితుడు అక్షయ్‌కు ఫోన్ చేయగా సమాధానం చెప్పకుండా ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మన్నె గోవర్ధన్‌రెడ్డి, నాయకులు గజ్జెల ఆనంద్, తదితరులు (ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి)



జలమండలి డీజీఎం కృష్ణను సత్కరిస్తున్న అంబానగర్‌కాలనీవాసులు

జలమండలి అధికారులకు సత్కారం

బౌద్ధనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ అంబానగర్‌లో మంచినీటి సమస్య తలెత్తకుండా కృషి చేసిన జలమండలి అధికారులను స్థానిక కాలనీవాసులు సత్కరించారు. సోమవారం శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో కాలనీ అధ్యక్షుడు మంద వెంకటస్వామి ఆధ్వర్యంలో కాలనీవాసులు మారేడుపల్లి జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్ ప్రియాంక, సిబ్బంది శ్రీకాంత్‌ను పూలమాలలు వేసి సత్కరించారు. కాలనీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకురాగానే ఇరవై లక్షల రూపాయల వ్యయంతో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవటం సంతోషకరమని కాలనీవాసులు తెలిపారు.

స్వయం పాలన దిశగా దక్షిణాది ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలి



ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

తార్నాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది పాలకుల ఆధిపత్యం నుంచి దక్షిణాది రాష్ట్రాలను పరిరక్షించుకోవాలంటే స్వయం పాలన, ఆత్మగౌరవం దిశగా దక్షిణాది ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని సౌత్ ఇండియా జేఏసీ కన్వీనర్ ప్రొ.గాలివినోద్ కుమార్ అన్నారు. సోమవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాది జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ హోదా కల్పించకుండా, కాజీపేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కాళేశ్వరానికి జాతీయ హోదా లాంటి హామీలను నెరవేర్చకుండా బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా 52శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించకుండా తీరని అన్యాయం చేస్తుందని ఆరోపించారు.

తెలంగాణ విద్యార్థి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆషాడపు మధు



ఆషాడపు మధు

తార్నాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉస్మానియా విద్యార్థి, ఉద్యమ నాయకుడు ఆషాడపు మధు నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం ఆయన ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాడపు మధు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా గణపురం మండలానికి చెందిన తాను పాఠశాల స్థాయి నుంచే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూనే మరోవైపు అంచెలంచెలుగా ఉన్నత విద్యను అభ్యసిస్తూ ప్రస్తుతం ఓయూ లా కాలేజీలో న్యాయ విద్యార్థిగా తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంగా విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని, రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలపైన తెలంగాణ విద్యార్థి ఫోరం తరుపున నిరంతరం విద్యార్థులపక్షాన పోరాడుతానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల మాదిరిగా వ్యవహరించకుండా, విద్యారంగానికి తగిన ప్రాధాన్యతను ఇచ్చి, ఫీజులను నియంత్రించాలని కోరారు.

యువతి అదృశ్యం



స్వప్న (ఫైల్)

బౌద్ధనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన పి.శేఖర్ కుమార్తె పి.స్వప్న(19) నామాలగుండులో ఓ మార్ట్‌లో పనిచేస్తుంది. సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటలకు డ్యూటీకి వెళ్లుతున్నానని స్వప్న ఇంట్లో చెప్పి వెళ్లింది. 12:40నిమిషాలకు మార్ట్ నిర్వాహకులు స్వప్న తండ్రికి ఫోన్ చేసిన డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో శేఖర్ తనకుమార్తెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో తనకుమార్తె కనిపించటంలేదని తల్లి వసంత సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడిని సీడబ్ల్యూసీకి అప్పగిస్తున్న సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు

ఇంటి నుంచి పారిపోయిన బాలుడు రైల్వే స్టేషన్‌లో ప్రత్యక్షం

సీడబ్ల్యూసీకి అప్పగించిన ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఓ బాలుడిని ఆర్పీఎఫ్ పోలీసులు చేరదీశారు. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై ఎం.వీ.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 8 ఏళ్ల బాలుడు సాయి సోమవారం ఉదయం ఇంటి నుంచి పారిపోయి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్ ఫాం నెంబరు 10లో ఒంటరిగా నిలబడి ఉన్న బాలుడిని ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ వర్మ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తాను ఇంటి నుంచి పారిపోయి వచ్చానని విచారణలో వెల్లడైంది. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చేందుకు ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించగా బాలుడిని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ హోంలో చేర్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఓట్ల లెక్కింపు

- ఓయూలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనం వద్ద భారీ భద్రత
- 14 టేబుల్స్.. 400 మంది సిబ్బంది నియామకం
- ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం
- లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

బౌద్ధనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన తర్వాత, వాటి ఫలితాలను వెలువరించి, అనంతరం ఓటింగ్ లెక్కింపు ప్రక్రియను చేపడతారు. ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనంలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలను మూడంచెల భద్రత నడుమ భద్రపరిచారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 2,66,337మంది ఓటర్లు ఉండగా, 1,39,761మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించేందుకు నాలుగు వందల మంది సిబ్బందిని నియమించామని అధికారులు తెలిపారు. పద్నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేయగా.. ప్రతి టేబుల్ వద్ద ముగ్గురు అధికారులను నియమించారు. ప్రతి రౌండు నలభై నిమిషాల నుంచి గంటలోపే ఫలితాలు వెలువరించే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

ఉస్మానియా యూనివర్శిటీలోని రాంరెడ్డి దూరవిద్యాకేంద్రంలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను సోమవారం ఉదయం సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, సహాయ అధికారులు సుభాష్ రావు, ఎల్లారెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్‌లు పరిశీలించారు. కౌంటింగ్ లెక్కింపు అధికారులతో సమావేశమయ్యారు. కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుల్స్‌ను పరిశీలించారు. కౌంటింగ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ భద్రత

కౌంటింగ్ కేంద్రం వద్ద బయట, లెక్కింపు ప్రాంతాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. డీసీపీ రావుల గిరిధర్ నేతృత్వంలో ఆరుగురు ఏసీపీలు, ఐదువందల మంది సిబ్బంది ఈ ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొననున్నారు. ఎప్పటికప్పుడు సమాచారమందించటానికి మీడియా పాయింట్‌ను ఏర్పాటుచేశారు. ఎన్నికల సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లు, ఉన్నతాధికారులను మినహా లోపలికి ఎవ్వరినీ అనుమతించరు. రౌండ్లవారీగా ఫలితాలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శించనున్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వేళ్లేందుకు పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఇప్పటికే పాసులు జారీ చేశారు. తార్నాక నుంచి విద్యానగర్, ఆర్ట్స్‌కాలేజీ, డీడీ కాలనీ, అడిక్‌మెట్ వెళ్లే రహదారుల్లో భారీ భద్రతను ఏర్పాటు చేయటంతోపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనంలో సనత్‌నగర్ ఓట్ల లెక్కింపు

రెజిమెంటల్‌బజార్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గం సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనంలో జరగనుండటంతో అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ జరిగే భవనం వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ విధుల్లో ఉండే సిబ్బంది గుర్తింపు కార్డులు సైతం తనిఖీలు చేసిన అనంతరం భవనంలోకి అనుమతిస్తున్నారు. మీడియా లాంజ్, సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లను ఏర్పాటుచేశారు.



ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి హేమంత్ కేశవపాటిల్



టేబుల్స్ వద్ద పనిలో నిమగ్నమైన సిబ్బంది



సనత్‌నగర్‌లో ఓట్ల లెక్కింపు జరిగే భవనం

కంటోన్మెంట్ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

సికింద్రాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అటు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం, ఇటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గానికి, సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక జరిగిన సంగతి విదితమే. ఈ రెండు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సికింద్రాబాద్ ప్యారడైజ్ సమీపంలోని వెస్లీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వెస్లీ కళాశాలలోని రెండు విశాలమైన హాళ్లలో ఓట్లు లెక్కించనున్నారు. 242 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 17 రౌండ్ల పాటు ఓట్ల లెక్కింపు జరగనుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో 1,23,297 ఓట్లు పోల్ కాగా, తాజా ఎన్నికల్లో 1,30,929 ఓట్లు పోలయ్యాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు 59,057 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ (ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి)కు 41,888 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెలకు 20,825 ఓట్లు వచ్చాయి. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున లాస్యనందిత అక్క నివేదిత బరిలో నిలవగా, శ్రీగణేష్ హస్తం పార్టీ అభ్యర్థిగా రేసులో నిలిచారు. వంశతిలక్ కమలం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.

మోండా మార్కెట్ 2వ వార్డు కీలకం

రక్షణ శాఖ పరిధిలోని 8వార్డులతో పోలిస్తే జీహెచ్ఎంసీ పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్ ఓట్లు అత్యధికంగా ఉండడంతో ఈ డివిజన్ ఓటర్ల తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గడిచిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనూహ్యంగా ఈ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి కొంతం దీపిక ఘనవిజయం సాధించారు. రాజకీయాలకు సైతం కొత్త అయినప్పటికీ ఐదు వేల భారీ ఆధిక్యతతో ఆమె గెలవడం ఇప్పటికీ చర్చనీయాంశమే. 41,779 ఓట్లు ఉన్న ఈ డివిజన్‌లో అత్యధికంగా 22,206 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ కార్పొరేటర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ డివిజన్‌లో కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలైఉంటాయోనని అన్ని రాజకీయ పార్టీలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. అదేవిధంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 2వ వార్డు (రసూల్‌పురా) కూడా కీలకం కానుండడం గమనార్హం. ఈ వార్డులో 33,885 ఓట్లు ఉండగా, 17,239 ఓట్లు పోలయ్యాయి. ముస్లిం ఓటర్లు 8వేల వరకు ఉంటారని అంచనా. అందుకే ఈ వార్డు నుంచి వచ్చే మెజారిటీ సైతం కీలకం కానున్నది.

వైభవంగా తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు



బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న నర్సింహ ముదిరాజ్, తెలంగాణ ఉద్యమకారులు



బోయినపల్లి బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో దశాబ్ది వేడుకలలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బోయినపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం బోయినపల్లి సౌజన్యకాలనీలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలను రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మొదటగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఆ తరువాత బీఆర్ఎస్ జెండాను ఎగరవేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతో పాటు గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులు తదితర అంశాలను ఆయన గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తకావడంతో తెలంగాణ అంతటా దశాబ్ది ఉత్సవాల సందడి నెలకొందన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యుడు పాండుయాదవ్, ప్రవీణ్ యాదవ్, రాజుసింగ్‌లతోపాటు అభిమానులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్ : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యుడు నర్సింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. సోమవారం రెజిమెంటల్‌బజార్‌లోని గండిమైసమ్మ కూడలిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన ప్రాణాలను పణంగా పెట్టి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చేసిన పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అశోక్, మురళి యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, సందీప్, క్రిస్టోఫర్, రాము, నారాయణ, గణేష్, పరశురామ్, రవి తదితరులు పాల్గొన్నారు.



లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీవారి హుండీ లెక్కింపు

మల్కాజిగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోని హుండీని సోమవారం ఎండోమెంట్ అధికారి డి.రవికుమార్ సమక్షంలో లెక్కించారు. 80 రోజులుగా భక్తులు స్వామివారికి సమర్పించిన కట్నకానుకలు లెక్కించగా రూ.4,35,885 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఏబీ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు, క్లర్కు సంద్ర సుధాకర్‌తో పాటు భక్తులు, మాజీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.



శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

ఘనంగా మహాలక్ష్మి దేవాలయ వార్షికోత్సవం

మౌలాలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మౌలాలి డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో గల మహాలక్ష్మీ దేవాలయ 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం మూడో రోజు సందర్భంగా ఉదయం అమ్మవారి ఆలయంలో మహాపూర్ణాహుతి, అష్టోత్తర శతకలశం, శాంతి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు, కాలనీల ప్రజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.వి.రమణరావు, లక్ష్మీరెడ్డి, కార్యదర్శిగా కె.బి.ప్రసాద్, సహాయ కార్యదర్శి సంజీవరావు, కోశాధికారిగా చంద్రమౌళి, అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అతిగా నవ్వుతూ..!

నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు. అలాగే నవ్వు నాలుగు విధాల చేటు చేస్తుందని కూడా అంటారు. కొందరి విషయంలో పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. ఓ వ్యక్తి విషయంలో ఇలాగే జరిగింది. టీవీలో కామెడీ షో చూసి విరగపడి ఎక్కువ సేపు నవ్వుతూనే అకస్మాత్తుగా అచేతనంగా కిందపడిపోయాడు. అతన్ని పరిశీలించిన వైద్యులు దాన్ని మూర్ఛకు సంబంధించిన.. స్పృహ కోల్పోయిన సమస్యగా నిర్ధారించారు. ఈరకం జబ్బుతో బాధపడే వారు కూడా ఉంటారా.. అని ఆశ్చర్యమనిపిస్తుంది. అవును ఇలాంటి ఓ కేసు అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ వద్దకు వచ్చింది. ఆయన ఈ కేసు వివరాలను తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పంచుకున్నారు.

\- హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

- పగలబడి నవ్వుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తి
- కాసేపు అచేతనం.. తర్వాత సాధారణ స్థితికి
- అపోలోకి తరలింపు
- ఏమీ కాలేదని తేల్చిన వైద్యులు
- నవ్వు ప్రేరిత సింకోప్‌గా నిర్ధారణ

హైదరాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఓ వ్యక్తి విపరీతమైన నవ్వుతో స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. వారం, పది రోజుల క్రితం సదరు వ్యక్తి కుర్చీలో కూర్చుని టీ తాగుతూ తన కుటుంబంతో కలిసి టీవీలో కామెడీ షో చూస్తున్నాడు. ఆ షోలో ఒక అంశం ఆయనకు విపరీతమైన నవ్వును తెప్పించింది. నవ్వును అదుపు చేసుకోలేనంతగా కొన్ని నిమిషాల పాటు పగలబడి ఆగకుండా నవ్వాడు. ఈ క్రమంలో అతను నియంత్రణ కోల్పోయాడు. కొద్ది సేపటి తర్వాత, అతని శరీరం ఒక వైపునకు వంగి, కుర్చీ నుంచి నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాడు.



ఫైల్ ఫోటో

ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో కళ్లు తెరిచి, తన శరీరాన్ని కదిలించడంతో పాటు మాట్లాడగలిగాడు. ఈ క్రమంలో అతన్ని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అతనికి ఎలాంటి హానీ జరగలేదని, అనారోగ్యం ఏమీ లేదని నిర్ధారించారు.

అతన్ని న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ పరిశీలించి ఈ పరిస్థితిని నవ్వు ప్రేరిత సింకోప్ (Laughter-induced syncope)గా నిర్ధారించారు. ఇది వాసోవాగల్ మెకానిజమ్స్ వల్ల ఏర్పడే అరుదైన అంశంగా ఆయన గుర్తించారు. ఇది ఒక విధమైన మూర్ఛకు సంబంధిత సమస్య అని, ఎలాంటి మందులు అవసరం లేదని, ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తేల్చారు.

అధిక నవ్వుతో రక్త సరఫరా తగ్గే ప్రమాదం..

విపరీతమైన నవ్వుతో ఒక్కోసారి రక్తపోటు వేగంగా తగ్గిపోతుందని, నాడీ వ్యవస్థ నుంచి అధిక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు. దీనివల్ల మెదడుకు ప్రవహించే రక్త సరఫరా తాత్కాలికంగా తగ్గుతుందని, ఫలితంగా స్పృహ కోల్పోయే ముప్పు ఉంటుందన్నారు. విపరీతమైన నవ్వు, ఎక్కువసేపు నిలబడటం, అధిక శారీరక శ్రమ వంటి మూర్ఛ సాధారణ ట్రిగ్గర్‌లను నివారించాలని డాక్టర్ సూచించారు. బీపీ మందులు వినియోగిస్తున్నవారు, గుండె జబ్బులు ఉన్న వారు అతిగా, బిగ్గరగా నవ్వొద్దని ఆయన సూచిస్తున్నారు. ప్రమాదం లేమీ లేకపోయినప్పటికీ రక్త ప్రసరణలో మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. 'ఎప్పుడు నవ్వుతూ.. సంతోషంగా ఉండాలని, సంతోషమే సగం బలమని వైద్యులు తరుచూ చెబుతుంటారు. కానీ, దేనిని అతిగా తీసుకోవడం మంచిది కాదని ఈ కేసులో నిరూపితమైంది' అని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు.



బోయినపల్లి కడక్‌పురలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

బోయినపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరితగతిన పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కంటోన్మెంటట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. న్యూబోయినపల్లి కృష్ణారెడ్డికాలనీ, జయనగర్, న్యూసిటీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు నరికి ఇళ్లముందు వేయడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని, కడక్‌పురాలో కలుషినీటి సరఫరా అవుతుందని, సమస్య పరిష్కరించాలని స్థానికులు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు జంపన ప్రతాప్ దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో సోమవారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయినపల్లి ఒకటో వార్డులో సమస్యలు ఉన్న ప్రాంతాల్లో జంపనప్రతాప్ పర్యటించారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను బోర్డు శానిటేషన్ విభాగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సిబ్బంది సహకారంతో ఇళ్ల ముందున్నచెట్ల కొమ్మలను తొలగింపజేశారు. కడక్‌పురలో వాటర్ వర్క్స్ సిబ్బంది ద్వారా కలుషితనీరు సరఫరా కాకుండా మంచినీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేయించారు. ఈ నేపథ్యంలో సమస్యలు వెంటనే పరిష్కారం కావడంతో ఆయా బస్తీల ప్రజలు జంపనప్రతాప్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కాలనీలు, బస్తీవాసులు నిజాముద్దీన్, నాగేశ్వరరావు, బాబూరావు, సిరాజ్, షౌకత్ పాల్గొన్నారు.

పౌరహక్కుల నేత వెంకటరమణిని వెనక్కి పంపిన పోలీస్‌లు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల నేత వెంకటరమణిని పోలీస్‌లు వెనక్కి పంపించారు. స్వీడన్ పౌరసత్వం కలిగిన వెంకటరమణిపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. వెంకటరమణి వస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీస్‌లు ఆయన్ను శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. 'వెంకటరమణిపై ప్రభుత్వం నిషేధం ఉంది. ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం. విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు." అని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తార్నాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు 52వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట ఉపాధ్యక్షుడు తొట్ల స్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శి తుంగబాలు, సూరంపల్లి పరశురాం, జంగం అవినాష్, జంగయ్య, పెద్దమ్మ రమేష్, అవినాష్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ విజేతలు భార్గవ్, మనీష్, మనోజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో భార్గవ్ రామ్ విజేతగా నిలిచాడు. ఆదివారం సనత్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓంప్రకాశ్ బిడ్లన్ మెమోరియల్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన భార్గవ్ (120+ కిలోలు), మనీష్ గౌడ్ (93 కి), మనోజ్ కుమార్ (59 కి) తమ విభాగాల్లో స్వర్ణాలు సాధించారు. ఇక, విశాల్ (82 కి) రజతం గెలిచాడు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షులు కొత్తపల్లి రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు.



కంటోన్మెంట్ సిబ్బంది తిరుమలగిరి చౌరస్తా కేంద్రీయ విద్యాలయం, బోయిన్‌పల్లి మార్కెట్ రోడ్డులో కేబుల్ నిర్మాణం నిమిత్తం గుంతలు చేశారు. వాటిని తిరిగి మూసివేయలేదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు సోమవారం పూడ్చివేయించారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా క్లియర్ అయింది.

\- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి